క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం అందజేసిన దృశ్యం

కామవరపుకోట: మండలంలో కేఎస్ రామవరంలో వేంచేసియున్న కనకదుర్గమ్మకు దాతలు వెండి కిరీటాన్ని సమర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆయన తల్లిదండ్రులైన గోరుముచ్చు రాములు, సూర్యకాంతం దంపతులు రూ.1.20 లక్షల విలువ గల వెండి కిరీటాన్ని మంగళవారం అమ్మవారికి సమర్పించారు.

రేపు పోతురాజు విగ్రహ ప్రతిష్టాపన



ప్రతిష్ఠకు సిద్ధమైన పోతురాజు విగ్రహం

కొయ్యలగూడెం: ముక్కోటి దేవతల ముద్దుల తమ్ముడు పోతురాజు విగ్రహ ప్రతిష్టాపనోత్సవం 21వ తేదీన కొయ్యలగూడెంలో నిర్వహించనున్నారు. గ్రామ ప్రజల ఇలవేల్పు చింతాలమ్మ అమ్మవారి (మెట్టినిల్లు) ఆలయం ఎదుట ఉదయం ఎనిమిది గంటలకు ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతు అభ్యుదయ కమిటీ పేర్కొంది. అంకాల చెరువు (పెద్ద చెరువు) గట్టుపై ఆలయం వద్ద గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహశర్మ పర్యవేక్షణలో ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామస్తులు పాల్గొనాలని కమిటీ పేర్కొంది.

వాలీసుగ్రీవుల గట్టుపై భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కామవరపుకోట: స్థానిక పాతూరు శివారులో గల వాలీసుగ్రీవుల గట్టుపై భక్తులతో సందడి నెలకొంది. కార్తీక మాసం మూడో మంగళవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గట్టుపై కొలువైయున్న తారాదేవి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

వృద్ధులకు ఆర్థిక సాయం



వృద్ధాశ్రమ నిర్వాహకులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: విజయనగరం జిల్లాలోని ఒక నిత్యాన్నదాన వృద్ధాశ్రమం నుంచి శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన వృద్ధులకు శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ మూర్తిని కలిశారు. ఆలయ ఈఓ ఆశ్రమ నిర్వాహకులను సత్కరించారు.

సుందరేశ్వరుడికి లక్ష బిల్వార్చన



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కార్తీకమాస బహుళ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి మీనాక్షి సుందరేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు.

శ్రీవారి ఆలయ పూర్వ ప్రధానార్చకుడి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ పూర్వ ప్రధానార్చకుడు ఖండవల్లి ప్రభాకరాచార్యులు (98) మంగళవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని ద్వారకాతిరుమలలోని పెద్ద కుమారుడు, ప్రస్తుత ఆలయ ప్రధానార్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులు (రాంబాబు) నివాసానికి తరలించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- ఎక్కడి చెత్త అక్కడే.. గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు



భూదేవిపేటలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు



జగన్నాథపురంలో రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త

వేలేరుపాడు: చెత్త నుంచి సంపద సృష్టి లక్ష్యంతో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు మండలంలో లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఈ యార్డులు నిర్మించారు. రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, తిర్లాపురం, నార్లవరం, కట్కూరు, కొయిదా, రామవరం, మేడేపల్లి, తదితర గ్రామ పంచాయతీల్లో రూ.18.47 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మించారు. కొన్ని చోట్ల కప్పులపై రేకులు వేయగా, మరికొన్ని చోట్ల తాటాకులతో కప్పారు. ఇందులో ఒక్క యార్డులోనూ చెత్త వేసిన దాఖలాలు లేవు. రేపాకగొమ్ము గ్రామ పంచాయతీ పరిధిలోని వేలేరుపాడు సంతబజారు వెనుక చెరువులో రూ.2.61 లక్షల వ్యయంతో నిర్మించిన యార్డు పైకప్పు తాటాకులు గాలికి లేచిపోయాయి. పెద్దపెద్ద కంపచెట్లు పెరిగిపోవడం వలన ఇక్కడ చెత్త వేయడానికి వెళ్లాలన్నా దారీ తెన్నూ లేదు. ఇది ఎవరి కోసం నిర్మించారో అధికారులకే తెలియాలి. మేడేపల్లి, భూదేవిపేట, గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల మందు బాబులకు అడ్డాగా మారాయని చెప్పొచ్చు.

ఎక్కడి చెత్త అక్కడే

ఏ వీధిలో చూసినా చెత్తే అన్న చందంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో రహదారి వెంబడి చెత్తే దర్శనమిస్తోంది. ఈ చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి, రైతులకు వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పల్లెల్లో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నది ధ్యేయం. కానీ ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు.

చెత్తతో వర్మీకంపోస్ట్ తయారీ

మండలంలో నిర్మించిన తొమ్మిది డంపింగ్ యార్డుల్లో 88 వర్మీకంపోస్టు తొట్టిలు నిర్మించారు. ఇందులో ఏ ఒక్క యార్డు తొట్టిల్లో చెత్తే వేయడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డంపింగ్ యార్డుల లోపల, బయట నిర్మించిన తొట్టెల్లో వీధుల్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తా చెదారం వేయాలి. ఈ చెత్తను పది రోజులు అందులో ఉంచాలి. పది రోజుల తర్వాత వానపాములను వదలాలి. ఇలా వానపాములు వదిలిన 40 రోజుల తర్వాత వర్మీకంపోస్టు ఎరువు తయారవుతుంది. దీనిని రైతులు వాడుకోవచ్చు. అసలు ఈ తొట్టెల్లో చెత్తే వేయడం లేదు. వర్మీకంపోస్టు ఎరువు ఎలా తయారవుతుంది.

> **చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు చేపడతాం**
>
> 
>
> చెత్తను సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. డంపింగ్ యార్డులకు తరలించడానికి ఉన్న ఆటో రిక్షాలు మూలన పడ్డాయి. అనేక డంపింగ్ యార్డులు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటాం.
>
> శ్రీహరి, ఎంపీడీఓ, వేలేరుపాడు

మనోధైర్యంతో ముందుకు సాగాలి

జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌కు వైఎస్ జగన్ భరోసా



వైఎస్సార్‌సీపీ అధినేతతో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్

కొయ్యలగూడెం: మనోధైర్యంతో మనమంతా ముందుకు సాగాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చినట్లు ఏలూరు వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేతను కలిసిన సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ కూటమి కక్ష సాధింపు చర్యలు ప్రజలు గమనిస్తున్నారని జవాబు ఇచ్చే రోజు మళ్లీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారన్నారు. ఇటీవల తాను, తన కుటుంబం సభ్యులు ఎదుర్కొన్న వేధింపుల గురించి, అవమానాల గురించి అధినేత వద్ద ప్రస్తావించానన్నారు. అధైర్య పడొద్దని అండగా నాతో సహా పార్టీ అగ్ర నాయకులు సోషల్ మీడియా కన్వీనర్లకు, పార్టీ శ్రేణులకు మద్దతుగా ఉన్నారని ధైర్యం కలిపించారన్నారు.

మద్ది క్షేత్రంలో మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ చందన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం మంత్రి కొలుసు పార్థసారధి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ సహాయ కమిషనర్ చందన మంత్రికి స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, మేకా ఈశ్వరయ్య, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు

కార్తీక మాసం మంగళవారం కావడంతో మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక్క రోజు ఆదాయం రూ: 7,61,167 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఘంటా సత్యనారాయణ, మాసిరెడ్డి గాంధీ వెంకట రామ మోహనరావు, అన్నెం వంశీ కృష్ణలు 15,000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. పోలీస్ శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది తమ సేవలందించారు.

యువకుడిపై దాడి



బాధితుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు జ్ఞానారెడ్డి

చింతలపూడి: ఫాతిమాపురం గ్రామానికి చెందిన సందిపాం చరణ్ అనే యువకుడిపై సోమవారం రాత్రి ముగ్గురు యువకులు దాడి చేయడంతో చరణ్ చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పాత గొడవల నేపథ్యంలో సోమవారం రాత్రి ప్రగడవరం మద్యం దుకాణానికి స్నేహితుడితో కలిసి వెళ్లిన తనను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వెంబడించి తమ మోటారు సైకిల్‌ను ఆపడంతో తన స్నేహితుడు తప్పించుకుని పారిపోయాడని దీంతో తనను కర్రలతో, రాళ్లతో కొట్టారని తెలిపాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బాధితుడిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చరణ్‌ను పరామర్శించారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేసిన కారణంగానే చరణ్‌పై దాడి చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికి వస్తే చట్టపరంగా, న్యాయపరంగా పోరాడతామని హెచ్చరించారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు అండగా ఉన్నారని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్టీవో

జంగారెడ్డిగూడెం: రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఆర్టీవో ఎండీ మదని అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధారణతో పాటు, పరిమిత వేగం, సిగ్నలింగ్ వంటి నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా సరైన వాహన ధృవీకరణపత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 85 కేసులు నమోదు చేసినట్లు ఆర్టీవో మదని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రంగనాయకులు, ఏఎంవీఐలు వై.సురేష్‌బాబు, జమీర్, జగదీష్, నెహ్రూ, నరేంద్ర పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



లింగపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ ముత్యాలరావు

లింగపాలెం: రసాయనిక ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ అధికారులు ఏడీఏ బి.నాగకుమార్, ఏవో ఎ.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.గోకవరం, అన్నపనేనివారి గూడెం గ్రామాల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన చీమలవారిగూడెం, పులిరామన్నగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంభిస్తూ సేంద్రియ, వ్యర్థ పదార్థాలను వినియోగిస్తూ వ్యవసాయం చేస్తే ఖర్చును తగ్గించుకోవచ్చని చెప్పారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగాన్ని తగ్గించాలన్నారు. వీటిని అధికంగా వాడటం వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి సేద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చింతలపూడి: చింతలపూడి ఎత్తిపోతల భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పి.పాండు రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం అరకొరగా ఉండటం వలన రైతులు ఉద్యమ బాట పట్టారన్నారు. 10 సంవత్సరాల క్రితం ఎకరాకు రూ.12.50 లక్షలు ప్రకటించగా రైతాంగం తిరస్కరించినట్లు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.30 లక్షలు లేదా భూమికి భూమి ఇవ్వాలని పెద్ద ఎత్తున ఉద్యమించారని చెప్పారు. కొంత మంది రైతులు తమకు అన్యాయం జరుగుతుందని న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారన్నారు. రైతులు న్యాయమైన పరిహారం కోసం చేస్తున్న పోరాటానికి కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు వెన్నుదన్నుగా ఉంటాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో కె.అనురాధ, డి.సత్యనారాయణ, ఆర్.ధర్మారావు పాల్గొన్నారు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా

పెనుగొండ: పెనుగొండ శివారు నక్కల డ్రెయిన్ సమీపంలో ఇటుకల లోడు ట్రాక్టరు అదుపు తప్పి పంటబోదేలో బోల్తా పడింది. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి నుంచి భీమవరం వైపు వెళుతూ ట్రక్కుకు ఉన్న పిన్ను ఊడిపోవడంతో పంటబోదేలోకి దూసుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ట్రాక్టరుపై ఉన్న కూలీలకు గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బకాయి వేతనాలను విడుదల చేయాలి



నగర పంచాయతీ కమిషనర్ డి.పావనికి మెమోరాండం అందజేస్తున్న కార్మికులు

చింతలపూడి: నగర పంచాయతీ కార్మికుల రెండు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు తుర్లపాటి బాబు మాట్లాడుతూ నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి కార్మికులకు రావలసిన పే ఎరియర్స్ లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయని ప్రభుత్వ జీవో ప్రకారం స్వీపర్లకు రూ.21,000 జీతం చెల్లించాలన్నారు. వీరి ధర్నాకు సీపీఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు సంఘీభావం తెలిపారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ డి.పావనికి మెమోరాండం అందజేశారు.

మహిళా సాధికారతపై అవగాహన తప్పనిసరి



ద్వారకాతిరుమల: మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారిణి



లింగపాలెం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మహిళా సాధికారతపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి, గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గురుకుల వైస్ ప్రిన్సిపాల్ విజయభారతి, సంగీత ఉపాధ్యాయురాలు గోదాదేవి, సచివాలయం మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజన, దేవస్థానం పాఠశాల ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెంలో

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ధర్మాజీగూడెం వీఆర్‌వో గారపాటి శారద పాల్గొని విద్యార్థులకు దిశా చట్టం గురించి వివరించారు. విద్యార్థినీ విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం మహిళ పోలీస్ ఎస్.గంగారత్నం ఇందిరా గాంధీ జీవిత చరిత్రను విద్యార్థులకు తెలిపారు. అనంతరం గ్రంథాలయంలో ఇతర దేశాల కరెన్సీ, నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

పోలవరం రూరల్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శాఖా గ్రంథాలయ ఆవశ్యకత, పాఠ్యాంశాలపై విద్యార్థులకు గ్రంథాలయ నిర్వాహకులు జె.సుబ్రహ్మణ్యం పలు సూచనలు ఇచ్చారు. గ్రంథాలయానికి నిత్యం విద్యార్థులు వచ్చే విధంగా తల్లితండ్రులు అలవాటు చేసి సహకరించాలన్నారు. గ్రంథాలయాల్లో రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

చిత్తులాటపై పోలీసుల దాడి

చింతలపూడి: మండలంలోని లింగగూడెం గ్రామంలో చిత్తులాటపై సీఐ ఎం.రవీంద్ర మంగళవారం దాడి చేశారు. దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.12,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలం తానాల కుంట గ్రామంలో రెండు గిరిజన వర్గాల మధ్య భూ సమస్య కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో పోలవరం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కె.ముక్కారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ అధికారులు జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తాడువాయి గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న నాగ వీరభద్రరావును అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అలాగే జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి



మద్యం సీసాలు కలిగి ఉన్న నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐ అశోక్, సిబ్బంది

కామవరపుకోట: మద్యం సీసాలు కలిగిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో కళ్లచెరువు గ్రామంలో మంగళవారం బెల్ట్ షాపుల నిర్వాహకులపై దాడులు నిర్వహించగా ఒక వ్యక్తి దగ్గరి నుంచి 180 మిల్లీ లీటర్ల పరిమాణం గల 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు, అలాగే వడ్లపట్ల నూతన గ్రామంలో సారా కలిగిన పాత ముద్దాయి అయిన ఒక మహిళను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారని సీఐ అశోక్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కార్తీకమాస ప్రత్యేక పూజలు



గరిక అలంకరణలో గణపతి

కుక్కునూరు: కార్తీక మాసం సంకష్టహర చతుర్థి పురస్కరించుకుని మంగళవారం కుక్కునూరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సంకష్ట హర చతుర్థి తిథి కలిసి రావడంతో గణపతికి అభిషేకం, గరిక పూజ నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో శివలింగానికి అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.